కార్పొరేట్ అనుకూల బడ్జెట్

- కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల10న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా కార్యక్రమం
- ధర్నా చౌక్‌కు తరలిరావాలని పిలుపునిచ్చిన తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 10న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.50,65,345 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్‌ను శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిందని అన్నారు. ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జీడీపీ లోటు 4.4 శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవస్థాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంట్రాములు మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించక పోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ రమ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మానాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు కోట రమేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 2: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ బర్కత్‌పుర ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సోమవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బర్కత్‌పుర ఫీడర్ పరిధిలోని బర్కత్‌పుర బస్ డిపో, రత్నానగర్, బీజేపీ కార్యాలయం, అరవింద్ డిగ్రీ కాలేజ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

బన్సీలాల్‌పేట్: బోయిగూడ బీఆర్ఎస్ నాయకుడు సురేశ్ తల్లి ఎం.రాజమణి (80) ఆదివారం మృతి చెంచారు. విషయం తెలుసుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఐడీహెచ్ కాలనీకి వెళ్లి రాజమణి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సురేశ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపి, ఓదార్చారు. పలువురు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఆత్మ రక్షణకు తైక్వాండో దోహదం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: గాంధీనగర్ కెనరా బ్యాంక్ సమీపంలోని జీహెచ్ఎంసీ గ్రౌండ్స్‌లో ఆదివారం హైదరాబాద్ తైక్వాండో మార్షల్ ఆర్ట్ నిర్వాహకుడు, కోచ్ మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్, కలర్స్, బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు పంపిణీ ఆదివారం నిర్వహించారు. తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి మీర్ మహాజ్ ఆలీ ఖాన్, పలు పార్టీల నాయకులు ఎ.వినయ్‌కుమార్ హాజరైన శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బెల్టులు, సర్టిఫికెట్లు ఈ సందర్భంగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినర్ సంజయ్‌సింగ్, కోచ్‌లు మనీష్, రఘు, ఎస్.స్వామి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: కేంద్ర కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్రంగా అన్యాయం చేసిందని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని బీఎల్‌పీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి తగిన నిధులు సాధించడంలో తెలంగాణ నుంచి ఎన్నికైన 8 మంది బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని ఆరోపించారు. ఉత్తర తెలంగాణ నుంచి నేటికీ లక్షలాది మంది బహుజన శ్రామికవర్గ ప్రజలకు చెందిన యువతకు ఉపాధి అవకాశాల కోసం గల్ఫ్ దేశాలకు వలసలు పోతున్నారని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అకవాశాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. దేశంలోని ఆధిపత్య వర్గాలు, గురరాత్ కార్పొరేట్ గుత్తేదారులకు కాసుల వర్షం కురింపించే విధంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో బీఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

బొల్లారం, ఫిబ్రవరి 2: అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం న్యూబోయిన్‌పల్లి రజక అభివృద్ధి సేవా సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన సొంత నిధులతో బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తానని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రజక సేవా సంఘం అభివృద్ధి కమ్యూనిటీహాల్ నిర్మాణాకి తన వంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్, రాజు, కిషోర్, వీర, కృష్ణ, రమేష్, నర్సింగ్, రేణుక, గంగ, మంగమ్మ, ముత్యాల తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి, పాండుయాదవ్

ఎమ్మెల్యే పద్మారావుకు మంద కృష్ణ పరామర్శ

ఎమ్మెల్యే పద్మారావుతో మంద కృష్ణ మాదిగ, తదితరులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 2: ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్‌ను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదివారం మోండా మార్కెట్‌లోని ఆయన నివాసంలో కలుసుకొని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా ఈనెల 7న తన ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్‌బీస్టేడియం నుంచి నిర్వహించే వేల గొంతుకలు, లక్ష డప్పులు కార్యక్రమానికి మద్దతు తెలపాలని మంద కృష్ణ మాదిగ ఈ సందర్భంగా పద్మారావుగౌడ్‌ను కోరారు. అందుకు పద్మారావుగౌడ్ సానుకూలంగా స్పందించి మద్దతును తెలిపారు. కార్యక్రమంలో అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మితో పాటు యువ నేతలు కిషోర్‌కుమార్, రామేశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్యార్వీ ఉత్సవాలకు ఎమ్మెల్యే తలసాని హాజరు

గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, ఫిబ్రవరి 2: సిటీలైట్ హోటల్ సమీపంలోని దర్గాలో ఆదివారం జరిగిన గ్యార్వీ శరీఫ్ ఉత్సవాల్లో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రార్థనల్లో పాల్గొన్న ఆయనను ఆశీర్వదించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులు జావీద్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, రాంగోపాల్‌పేట్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ప్రేమ్‌కుమార్, గౌరీశంకర్, వినయ్‌కుమార్, మహేశ్, అర్జున్, శివ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 2: పేదల విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్ సెంయిట్ పాయిస్ స్కూల్ వార్షికోవత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యాపార దృక్పథంతో కాకుండా పేదలను దృష్టిలో పెట్టుకొని విద్యాబోధనకు కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించి సాంస్కృతిక, క్రీడా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లిండా జెరాల్డ్, కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్య, కె.మార్గెట్, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ చిరంజీవి, బీఆర్ఎస్ నాయకుడు రావుల పాటి మోజస్, మేజర్ జయసుధ, నందిని అగసార, నక్షత్ర పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ప్రోత్సహించడం అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న సినీ నటుడు మురళీమోహన్

బొల్లారం, ఫిబ్రవరి 2: అనాథ పిల్లలను చేరదీసి ఉన్నత విద్యతో పాటు క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తున్న తారా ఫౌండేషన్ కృషి అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ అన్నారు. బోయిన్‌పల్లిలోని అనాథాశ్రమంలో 25వ ఫ్రీస్టాహుడ్ వేడుకలకు ముఖ్యఅతిథులుగా సినీ ప్రముఖులు మురళీమోహన్, భానుచందర్, చిట్టిబాబు హాజరయ్యారు. ఆశ్రమానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ఈనెల 5 నుంచి 17వరకు మలేషియాలో జరుగనున్న అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలకు ఎంపికవడం అభినందనీయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సెయిలింగ్ పోటీల్లో తమ విద్యార్థులు ఇంటర్నేషనల్ స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

గంగపుత్ర నూతన కమిటీ

సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి గణేశ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 2: వారాసిగూడ గంగపుత్ర వెల్ఫేర్ సొసైటీ 37వ సర్వ సభ్య సమావేశం నామాలగుండులోని సంఘం భవనంలో ఘనంగ జరిగింది. అధ్యక్షుడు చంద్రగిరి ఎల్లయ్య, కార్యదర్శి మూట గణేశ్ కార్యవర్గం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాక గాలేష్, కార్యదర్శిగా డాక్టర్ సందిరి రవీందర్, అధికారిగా కాపరబోయిన శ్రీకాంత్‌లతో పాటు తదితరులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బొల్లారం విద్యార్థులకు కరాటేలో పతకాలు

మాస్టర్ కలీమ్‌తోపాటు విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ పతకాలు అందజేస్తున్న స్పోర్ట్స్ ఫెడరేషన్ చైర్మన్ ఖాజూద్దీన్

బొల్లారం, ఫిబ్రవరి 2: సమాజంలో ప్రస్తుత పరిస్థితుల్లో మార్షల్ ఆర్ట్, సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవడం చాలా ముఖ్యమని స్పోర్ట్స్ ఫెడరేషన్ చైర్మన్ మాస్టర్ ఖాజూద్దీన్ అన్నారు. వరల్డ్ నకాయమ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆదివారం నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. బొల్లారంలోని లయన్ మార్షల్ ఆర్ట్స్ మార్షల్ షేక్ కలీమ్‌కు స్పైరింగ్‌లో మెదటి స్థానం, విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్ పతకాలతో పాటు ప్రశంసా పత్రాలు మాస్టర్ ఖాజూద్దీన్ అందజేశారు.

మంద కృష్ణ మాదిగ సన్మాన సభను జయప్రదం చేయండి

ఆత్మీయ సన్మాన సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు ఇటీవల భారత ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిజాం కళాశాలలో సోమవారం నిర్వహించనున్న ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని పలువురు అధ్యాపకులు పిలుపునిచ్చారు. సంబంధిత వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని సెంటెనరీ పైలాన్ ఎదుట ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్యక్రమానికి వర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ ఎస్వీ రత్నం, డాక్టర్ దుబ్బ రంజిత్, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ యుగంధర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ తాళ్ల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బాధితురాలికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్

బొల్లారం, ఫిబ్రవరి 2: సీఎం సహాయనిధి పేదలకు ఎంతగానో దోహదపడుతుందని బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌కు చెందిన జకీయా ఫాతిమా కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ మేరకు మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి చొరవతో మంజూరైన రూ.60వేల చెక్కును ఆదివారం టీఎన్ శ్రీనివాస్ తన కార్యాలయంలో బాధితురాలికి అందజేశారు.

రాష్ట్ర ప్రభుత్వాలపై వివక్ష పెరిగిపోయింది

సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర ప్రభుత్వ వివక్షత పెరిగిపోయిందని విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. బడ్జెల్‌లో రాష్ట్రానికి తీవ్ర వివక్ష చూపారాని తెలిపారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (న్యూ)ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక సదస్సును నిర్వహించారు. ముఖ్యవక్తగా చంద్రకుమార్ హాజరై మాట్లాడారు. అన్నిరకాల ఉత్పత్తులు చేసేది కార్మిక వర్గం మాత్రమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్నారని, కానీ ఉన్న వాటిని కూడా ఊడబీకుతున్నారని మండిపడ్డారు. కార్మికులపైన శ్రమభారాన్ని పెంచుతూ కార్మిక వర్గానికి గతంలో ఉన్న ప్రయోజనాలను అన్నింటిని రద్దు చేస్తున్నారని వమర్శించారు. విశ్రాంత ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, ఏఐఎఫ్‌టీయూ న్యూ అధ్యక్షుడు కామ్రేడ్ గుర్రం విజయ్‌కుమార్, ఏఐకేఎంకేఎస్ నాయకుడు ప్రసాద్, ఏఐఎఫ్‌టీయూ న్యూ కేంద్ర కమిటీ నాయకుడు గణేశ్ పండా, కిషోర్ బాబు, తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేమిడి ఉప్పలయ్య, రామచందర్, ప్రసాద్, రుద్రారపు ఎల్లన్న పాల్గొన్నారు.

వీరమాతలు చూపిన మార్గాన్ని అనుసరించాలి

బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశర్లు, ఉపాధ్యక్షురాలు సుజాత, తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: జాతీయ గౌరవాన్ని నిలిపిన మహనీయులను మరువొద్దని, వీరమాతలు చూపి మార్గంలో బాలికలు వారిని అనుసరించాలని తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో షీరోలుగా నిలిచిన విద్యార్థులకు అభినందన సభను నిర్వహించారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలు సమానమే అని అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కె.సుజాత, ఇ.మమత, కవయిత్రి రూప రుక్మిణి, నవీన్, బ్రహ్మణి, మంజు పాల్గొన్నారు.

త్వరితగతిన సీసీరోడ్డు పనులు చేపట్టాలి

కంటోన్మెంట్, ఫిబ్రవరి 2: బోయిన్‌పల్లి తోకట్ట విలేజ్‌లోని గ్రేవ్‌యార్డ్ ప్రాంతంలో చేపట్టాల్సిన సీసీరోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని బోర్డు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను బస్తీకి చెందిన ఎనముల విజయ్, మధుతో పాటు స్థానికులు కోరారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ ఒకటో వార్డు నుంచి ఆరో వార్డు వరకు కనెక్టివిటీ, గ్రేవ్‌యార్డ్ ప్రాంతంలో సీసీరోడ్డు నిర్మాణం కోసం సుమారు రూ.50లక్షల నిధులను 2023 మే 10వ తేదీన జరిగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో మంజూరు చేశారని తెలిపారు. రెండేళ్లు కావొస్తున్నా పనులకు సంబంధించి ఊసే లేదన్నారు. శ్మశానవాటికకు వచ్చే సందర్భంలో ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికంగా దారి సరిగ్గా లేకపోవడంతో అనేక ఇక్కట్లకు గురికావాల్సి వస్తుందన్నారు. బోర్డులో తీసుకున్న నిర్ణయాలకే దిక్కులేకపోవడం శోచనీయమన్నారు. ప్రధానంగా రోడ్లు మరమ్మతులు, నూతన రోడ్లు వేయకుండా తోకట్ట విలేజ్‌పై అధికారులు శీతకన్ను వేస్తున్నారని మండిపడ్డారు. బోర్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నా ఇక్కడ మాత్రం పనులు చేపట్టకపోవడంలో మర్మమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన పనులు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవాలని సూచించారు.

మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలి

ప్రభావతిని సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు, తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: శారీక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలని అప్పుడే మనిషి అనుకున్నది సాధించగలుతాడని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభావతిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నడువండి నడిపించండి అనే లక్ష్యంతో క్లబ్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, 301 డిస్ట్రిక్ గవర్నర్ లింగ ప్రకాశ్‌గుప్తా, గవర్నర్ చీఫ్ కోఆర్డినేటర్ సంపత్‌రెడ్డి, మురళీకృష్ణ, వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యాదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కల్యాణినాయక్, డాక్టర్ సునీల్, మాజీ అధ్యక్షుడు ఎస్.రమేశ్‌రెడ్డి, శైలజ, ఆర్.వివేక్, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేకర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ద్వారానే వికసిత్ భారత్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: గ్రామాభివృద్ధి ద్వారానే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని జమ్మూ-కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. దేశం పురోగాభివృద్ధి సాధించాలంటే విద్య ఎంతో ముఖ్యమని చెప్పారు. బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ) దక్షిణ భారత పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఐఐసీటీలోని వివేకానంద ఆడిటోరియంలో మహామహాన్ మాలవ్య మిషన్-బీహెచ్‌యూ పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మనోజ్ సిన్హా హాజరయ్యారు. కార్యక్రమంలో మాలవ్య మిషన్ జాతీయ అధ్యక్షుడు హరిశంకర్‌సింగ్, సెక్రెటరీ జనరల్ డాక్టర్ వేద ప్రకాశ్‌సింగ్ పాల్గొన్నారు.

ఉమ్మడి పౌర స్మృతి ఆవశ్యం

దేశ సామాజిక పురోగతి, అభివృద్ధికి ఉమ్మడి పౌరస్మృతి ఆవశ్యమని మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. పౌరస్మృతి అమలులో తెలంగాణ రెండో రాష్ట్రంగా నిలవాలని ఆకాంక్షించారు. 'విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్' ప్రారంభ సమావేశాన్ని ఓయూలోని పీజీఆర్ఆర్‌సీడీఈ సెనెటరీ హాల్‌లో శనివారం నిర్వహించారు. విద్యాసాగర్‌రావు హాజరై మాట్లాడుతూ అమెరికా, చైనా కంటే పెద్ద సంఖ్యలో భారత్‌లో యువత ఉందన్నారు. యువశక్తిని దేశాభివృద్ధికి వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కర్ణాటక సెంట్రల్ వర్సిటీ వీసీ సత్యనారాయణ, ఎన్.గౌతమ్‌రావు, విద్యావేత్తలు విష్ణువర్ధన్ రెడ్డి, మధుకర్, కొండా లక్ష్మికాంతరెడ్డి, డాక్టర్ హరిచరణ్, పుట్టా పాండురంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బండి సాయన్న, ఉమాశంకర్, విజేందర్‌రెడ్డి, వీణ దిగ్గీకర్, విజయచరణ్ తదితరులు హాజరయ్యారు.